పద్దాను ఆస్పత్రి నుంచి. ఆ లెటరు ఓ మైక్రోబయాలజిస్టుకి రాశారుట. తిన్నగా ఆ డాక్టరు దగ్గరికి వెళ్ళాను. ఆయన నా చెవిలో చీము స్వాబ్ తీసుకుని నా దగ్గర ఓ 50 రూపాయలు తీసుకుని, "మూడు రోజుల తర్వాత రారిపోర్టు సిద్ధంగా వుంటుంది" అన్నాడు. దానికి కల్చర్ సెన్సిటివిటీ చేస్తారుట. సరేనని మూడు రోజుల తర్వాత ఆయన దగ్గరకి వెళ్ళి రిపోర్టు తీసుకుని ఇఎన్‌టి స్పెషలిస్టు దగ్గరకి వెళ్ళి చూపించాను. ఆయన మళ్ళా నా చెవి ఓ సారి పరీక్ష చేసి రీ ఎగ్జామినేషను ఫీజు పాతిక రూపాయలు పుచ్చుకుని. గంభీరంగా ఓసారి నవ్వి "ఏం ఖంగారు లేదోయ్! ఈ మాత్రలు వాడు తగ్గిపోతుంది" అని రాసిచ్చారు. నేను ఆయనకి థాంక్సు చెప్పి ఆ చీటీ తీసుకుని వెళ్ళి మందులషాపులో మాత్రలు కొంటూ ఉంటే ఆ పేరెక్కడో విన్నట్లుగా అనిపించింది. ఎందుకో అనుమానమేసి నా బీరువా తీసి "ది న్యూ యిండియా క్లినిక్. డాక్టరు రాసిన మాత్రల చీటీ వెదికి తీశాను. అది చూసినప్పటినుంచీ యిలాఅయిపోయాన్రా. ఆ రెండుమాత్రలూ ఒక్కటే!" అంటూ ముగించాడు. నాకు వాడిమీద విజంగా జాలేసింది. కాని యిచ్చినమాట ప్రకారం జాలిపడటం మానేసి మరేం చెయ్యాలో తెలీక మరో రెండు "టీ"కి ఆర్డరిచ్చాము.

గమనిక :– ఇది ఏ స్పెషలిస్టునూ కించపరిచే వుద్దేశంతో వ్రాసినది కాదు. మధ్యతరగతి వారికి యింకా తక్కువ ఆదాయం కలవారికీ కూడా స్పెషలిస్టులు అందుబాటులో వుండాలన్న ఆశతో వ్రాసినది మాత్రమే.

## మినీకథ

# ఆశాసౌధం



రమ, నేను చిన్నప్పటి నుంచి స్నేహితులం. రమ అంత పేరున్న రచయిత్రి కాకపోయినా అది వ్రాసిన కథలు అప్పుడప్పుడు పత్రికల్లో వస్తూవుండేవి.

ఒకరోజు రమ నాతో– "లక్ష్మి నా కథ వీక్లీలో పడిందోయ్" అంది.

వెంటనే "పత్రికవాళ్ళు ఎంతిస్తారేంటి" అన్నాను. ఆ ఎంతలే పాతికో, ఏభయ్యో అంది. ఆ రోజునుంచి నాకు కంటిమీద కునుకు లేదు. రోజల్లా పనిచేసేదాన్నిగాని ధ్యాసంతా రమలాఎప్పుడుకథలు రాద్దామా, ఎప్పుడు సంపాదిద్దామా అని. పనంతా చేసుకుని రాత్రి భోజనాలయ్యేక కూర్చునే దాన్ని. రెండ్రోజులు ఎన్ని పేజీలు వ్రాసి చింపిపారేశానో! కథ సమంగా రాలేదు సరికదా నిద్ర చాలక నీరసం పట్టుకుంది.

మూడో రోజు తెల్లవారుఝామున మంచి ప్లాట్ తట్టింది. వెంటనే రాసేశాను పది పేజీలు. కథ నా మటుకు చాల బాగుందనిపించింది. వీక్లీకి ఆ రోజే పంపించేశాను.

కాలేజీలో చదివే మా పెద్దపిల్ల "అమ్మా జోళ్ళు ఎప్పటినుంచో కొంటానంటున్నావ్, ఎప్పుడు కొంటావు" అంటే.

"ఇంకెంతమ్మా ఒక్క పదిహేను రోజులు గడుపుకో శుభ్రమైనవి కొనుక్కుందువుగాని" అన్నాను.

రెండోవాడు బాబుకి నిక్కర్లు కొనాలని ఏ నెలకానెల ఇంటికి కావలసిన సామాను లన్నీ కొన్నాక యిరవయ్యో, ముప్ఫయ్యో మిగుల్తే కొనవచ్చు ననుకుంటే, అన్నీ కొనగా మిగిలేదేమిటి? నా మొహం:

ఎప్పటినుంచో మనసుపడి కొనుక్కున్న గులాబిరంగు పాలిస్టర్ చీరకి మాచింగ్ బ్లౌజు కొనుక్కోవాలని. మీటరు 27 రూపాయల ఖరీదు తల్చుకుంటే ప్రాణం ఉసూరుమనిపించేది. మావారు మాత్రం పాపం ఏమీ కొనుక్కోవాలని అనుకునేవారు కాదు. నిద్రపోతున్నా, ఏ పని చేస్తున్నా కథ ప్రచురించడానికి అంగీకరించినట్లు, తరువాత వచ్చే యాభై రూపాయలతో ఏం కొనాలన్న ధ్యాసే!

పోస్టులో వీక్లీ వచ్చింది.

అందులో నా కథ!

తరువాత యాభై రూపాయలు మనియార్డరు. దేవుడికి ఇస్తానన్న లంచం రూపాయి వెంటనే పెట్టేశాను.

అమ్మాయికి జోళ్ళు, బాబుకి నిక్కర్లు, మా వారికిష్టమైన జిలేబీలు. ఆఫీసు నుంచి యింటికి వచ్చిన మాశ్రీవారికి నాచేతులతో తినిపించాలని.

"ఏమండీ! మిమ్మల్నే మీ కిష్టమైన జిలేబీలు తెప్పించాను. ఇంకో రెండు తినండి."

"ఇదిగో చూడు– తెల్లవారింది గాని త్వరగాలేచి కాఫీ తయారుచెయ్యి, కేంపుకి వెళ్ళాలి. ఇంతకీ జిలేబీలు అంటున్నావేమిటి? ఏదేనా లాటరీ వచ్చినట్లు కల వచ్చిందేమిటి?" అన్న మా శ్రీవారి మాటలకి తెలివి వచ్చింది. అప్పు డనిపించింది యిదంతా కలని. మా నాయనమ్మ తెల్లవారు ఝామున వచ్చే కలలు తప్పకుండా నిజమౌతాయని చెప్పేది. నాలో ఆశ చావలేదు. పదిగంటలకి పోస్టుకేక విని పరుగెత్తు కొచ్చాను. తిరిగి వచ్చిన నా కథ నన్ను చూసి వెక్కిరించింది. తపాలా స్టాంపులు సరిపోలేదని, ఏభై పైస లిచ్చి నా కథను నేను విడిపించుకోవలసి వచ్చింది.

—ఓరుగంటి లక్ష్మిరామకృష్ణ